రియల్ స్టోరీ

# మానవతకు మరో రూపం

**కస్తూరి మురళీకృష్ణ**

**ఆ**గస్ట్ 16, 1995.

ఇంట్లోకి అడుగు పెడుతూండగానే ఫోను మోత వినిపించింది. బ్యాగు కూడా పక్కన పడేయకుండా పరుగెత్తి ఫోను ఎత్తింది ఆమీ మర్రే. ఎందుకో ఆ ఫోను దుర్వార్తను మోసుకు వస్తున్నదని ఆమెకు అనిపించింది.

రిసీవర్ ఎత్తగానే, ఎటువంటి పలకరింపులు, ఉపోద్ఘాతాలు లేకుండానే చెప్పింది ఆమీ వాళ్ల అమ్మ.

"ఆమీ... సెయింట్ జాన్ చర్చి కాలిపోతోంది". అంతే! కుప్పకూలిపోయింది ఆమీ మర్రే. దాదాపుగా తొమ్మిదేళ్ల శ్రమ క్షణంలో బూడిదై పోతోంది. వెంటనే తనని తాను నియంత్రించుకుంది.

గబుగబా బయటకు పరుగెత్తింది. కారులో వేగంగా 'సెయింట్ జాన్' చర్చి వైపుకు వెళ్తున్న ఆమీ మనసు అంతకంటే వేగంగా గతంలోకి పరుగులు తీసింది......

****

ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుపోయి విషాద వదనంతో ఆఫీసులోకి అడుగు పెట్టిన సిమ్మన్స్‌ను చూసి "నా ఛాంబర్ లోకి రా" ఆజ్ఞాపించింది ఆమీ.

ఎవరైనా ఆఫీసుకి ఆలస్యంగా వస్తే ఆమీ భరించలేదు. పైగా దుమ్ముకొట్టుకుపోయిన దుస్తులతో వచ్చేవాళ్లని ఆమె అసలు క్షమించదు. ఇప్పటికే సిమ్మన్స్ వల్ల తను అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సిమ్మన్స్ నల్లజాతికి చెందిన యువతి. అమెరికన్లు ఎంత విశాల హృదయాన్ని ప్రపంచానికి ప్రదర్శించినా, అంతర్గతంగా నల్లవారికీ, తెల్లవారికీ నడుమ ఉద్విగ్నతలు కొనసాగుతూనే ఉన్నాయి. అడుగడుగునా సంఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.

నల్లవారిని అణచివేయాలని, తక్కువ చేయాలని తెల్లవారు ప్రయత్నిస్తూనే ఉన్నారు. సామాజికంగా ఒక స్థాయికి ఎదిగిన నల్లవారు, తెల్లవారూ ఇటువంటి సంకుచిత భావనలు ప్రదర్శించటం లేదు. కానీ అడుగు స్థాయిలో ఈ భేదభావాలు రూపుమాసి పోలేదు.

సిమ్మన్స్‌కు తన కంపెనీలో ప్రాధాన్యం ఇస్తున్నదని ఆమీకి బెదిరింపు ఉత్తరాలు వచ్చాయి. ఫోన్‌కాల్స్ వచ్చాయి. "అర్హత ఉన్న తెల్లవాళ్లు అనేకులుండగా నిగ్గర్లను నెత్తికెక్కించుకోవాల్సిన అవసరం ఏముంది?" అంటూ ఆమె సన్నిహితులు కూడా ప్రశ్నించారు.

"నాకు కావాలసింది క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో విశ్వాసంగా పనిచేసే వ్యక్తి. అటువంటి వ్యక్తి శారీరక రంగుతో నాకు పనిలేదు. సిమ్మన్స్ సరిగా పనిచేయకనాడు ఆమె రంగుతో సంబంధం లేకుండా ఆమెని తీసేస్తాను" అని వాదించేది ఆమీ. కానీ సిమ్మన్స్ ప్రతి పనిలో తప్పులు వెతుకుతూ ఫిర్యాదులు చేసేవారి తాకిడి తట్టుకోవటం ఆమీకి కష్టమైంది. అటువంటి పరిస్థితిలో సిమ్మన్స్ ఇలా ఆలస్యంగా, అశుభ్రంగా రావటం ఆమీకి కోపం తెప్పించింది. తను ఛాంబర్‌లోకి రాగానే "ఆలస్యం ఎందుకైంది? ఆ వేషం ఏమిటి?" అని గద్దించింది.

ఆమె మాట పూర్తి కాకముందే కుర్చీలో కూలబడి భోరుమని ఏడవసాగింది సిమ్మన్స్. అది చూస్తుంటే ఆమీ హృదయం ద్రవించింది. ఒక మనిషి ఎంత బాధను అనుభవిస్తే, ఇంత హృదయ విదారకంగా రోదిస్తాడు! కానీ వ్యాపారానికి జాలి, దయాగుణాలు ఉండకూడదని ఆమీకి తెలుసు. అందుకే మనసులోని భావనలను దాచుకుని పైకి కఠినంగా అడిగింది-

"ఏడుపు ఆపి అసలు విషయం చెప్పు". కన్నీళ్ళు తుడుచుకుంది సిమ్మన్స్.

గద్గదిక స్వరంతో నెమ్మదిగా చెప్పటం ఆరంభించింది. "మేం నల్లవాళ్లం అందరం కలిసి 'సెయింట్ జాన్' చర్చి కట్టుకున్నాం. అది కట్టినప్పటినుంచీ మాకు బెదిరింపులు వస్తున్నాయి. పోలీసు రిపోర్టిచ్చాం. అయినా బెదిరింపులు ఆగలేదు. నిన్నరాత్రి ఎవరో చర్చిపై దాడిచేశారు. నిప్పుపెట్టి, సర్వనాశనం చేశారు. కానీ మేమంతా సమయానికి మేలుకోవటంతో పూర్తిగా దగ్ధం కాకుండా బతికిబయటపడ్డాం. అందుకే ఆలస్యమైంది. ఇంకా అందరూ అక్కడే ఉన్నారు. నేనే ఆలస్యమౌతున్నదని..." దుఃఖం హద్దులు దాటటంతో ఇక చెప్పలేకపోయింది సిమ్మన్స్.

సిమ్మన్స్ వైపు చూస్తూ కూచుంది ఆమీ. ఆమెకు విషయం సంపూర్ణంగా అర్థం కాలేదు. తాము ఉంటున్నది అమెరికాలో. 20వ శతాబ్దం చివర్లో. బానిసత్వాన్ని రద్దు చేసిన కొత్తల్లో 'క్లుక్లుక్స్ క్లాన్' అనే తెల్లవాళ్ల ముఠా నల్లవాళ్లపై అత్యాచారాలు సాగించింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. 'క్లుక్లుక్స్' పూర్తిగా అదృశ్యమైంది. అనేక రంగాలలో నల్లవాళ్లు అభివృద్ధి సాధిస్తున్నారు. తెల్లవారికి తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. 'ఇటువంటప్పుడు నల్లవార్ చర్చిపై తెల్లవారు దాడి చేయటమేమిటి?'- ఆమీ మనసు నొచ్చుకుంది.

"పద నేనూ వస్తాను, మీ చర్చి చూస్తాను. అవసరమైతే మన ఆఫీసు తరఫున ఏదైనా సహాయం చేస్తాను" అని సిమ్మన్స్‌ని లేవదీసింది ఆమీ.

***

చర్చి తన దృష్టిపథంలోకి రాగానే ఆమీ మనసులో బాధ మొదలైంది. చర్చి ఆవరణలోని శిలువను రెండుగా విరిచేశారు. పూలమొక్కలను తవ్వి పారేశారు. "నల్లవారికైనా, తెల్లవారికైనా శిలువ పవిత్రమైంది. మొక్కలు ప్రజలకు మేలు చేస్తాయేతప్ప ద్వేషం చూపవు. అలాంటి వాటిపైన కోపం ఎందుకు?" ఆమీ మనసులో ఆలోచన కలిగింది.

చర్చిలోపలకు అడుగు పెట్టగానే స్థాణువయిపోయింది ఆమీ.

కిటికీల అద్దాలు ముక్కలు ముక్కలై హాలునిండా పడున్నాయి. లోపల భక్తులు కూర్చునేందుకు ఉండాల్సిన బల్లలన్నీ సగం విరిగి ఉన్నాయి. మిగతా సగం కాలిపోయాయి. నల్లగా కాలిన గోడలపైన బుల్లెట్ల గుర్తులు కనిపిస్తున్నాయి. విరిగిన బల్లల నడుమ బీరు బాటిళ్లు, విస్కీ బాటిళ్లు పడున్నాయి. 'అంటే లోపలివన్నీ విరగ్గొట్టి ఇక్కడే తాగి నిప్పుపెట్టి వెళ్లారన్నమాట. ఎందుకని? ఎందుకంత విద్వేషం? ఒక చెంప కొడితే మరో చెంప చూపమని చెప్పిన ప్రవక్త అనుచరుల పని ఇదేనా?'-



దానవతను ఎదిరించి నిలిచిన మానవతామూర్తి ఆమీ

ఇంకో అడుగు ముందుకేసి ఆగిపోయింది ఆమీ. చర్చిలో చదివే పెద్ద బైబిలును చింపి పోగులు పెట్టారు. పాస్టర్ల కుర్చీలను పీకి ముక్కలు చేశారు. పియానోను కసికసిగా ముక్కలు చేశారు. అది సిమ్మన్స్ భర్త చర్చికోసం కొన్నాడు. దాన్ని ఆయనే మోగిస్తాడు. చర్చి ఫాదరు ఉప న్యసించే వేదికపైన బుల్లెటు గుర్తులున్నాయి. అంతేకాదు, ఆ వేదికపై ఉపయోగించిన కండోమ్‌లు పడిఉన్నాయి. అవి గూండాలు ఎందుకు ఉపయోగించారో, చెప్పకనే చెప్తున్నాయి....

కళ్లెత్తి గోడవైపు చూసిన ఆమీ కళ్లల్లో నీళ్లు! గోడపై ఉండాల్సిన పెద్ద సిలువను ముక్కలు చెక్కలు చేశారు. శిలువపై ఉండాల్సిన జీసస్ బొమ్మలు ఏ కీలుకి ఆ కీలు విరిచారు. కానీ గోడపైన మేకుల నుంచి ఓ చేయి మాత్రం వేలాడుతోంది. ఇక చూడలేకపోయింది ఆమీ. కళ్ల నుంచి నీరు ధారాపాతంగా కారుతూంటే, పెద్దగా ఏడుస్తూ చర్చినుంచి బయటకు పరుగెత్తుకు వచ్చింది.

"ఏసుక్రీస్తును ఆయన వ్యతిరేకులు శిలువ వేశారు. అయినా ఆయన మళ్లీ బతికాడు. కానీ ఆయన అనుచరులు వేసిన ఈ సిలువనుంచి ఆయన బతకగలడా?" ఇంటికి చేరుకున్నా ఆమీని ఇదే ఆలోచన వెంటాడసాగింది. ఏసుక్రీస్తు సకల మానవాళిని రక్షించటానికి అవత రించాడు. ప్రజల పాపాల శిక్షను తాను అనుభవించి ప్రపంచానికి ప్రేమను పంచి ఇచ్చాడు. కానీ ఇక్కడ జరిగిందేమిటి? నల్లవారి యేసు వేరు, తెల్లవారి యేసు వేరవుతాడా? నల్లవారు పూజించే యేసు, యేసు కాకుండాపోతాడా? దేవుడివిలువ రంగునుబట్టి మారుతుందా? బంగారం ఎవరి దగ్గర ఉన్నా దాని విలువ దానిదే'- రాత్రంతా ఆమీ మనసులో ఇవే ఆలోచనలు సుళ్ల తిరిగాయి.

"భగవంతుడా! నాకు మార్గదర్శనం చేయి" అని ప్రార్థించింది యేసును. తెల్లవారుతుండగా ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది.

> ఆమీయే స్వయంగా ప్రతి పత్రిక ఆఫీసుకి వెళ్లి ఆ వార్త అందించింది. ఫొటోలు ఇచ్చింది. ఒక్క 'డిస్పాచ్ న్యూస్' పత్రిక మాత్రమే ఆ వార్త ప్రచురించింది. చివరకు అదే ఆమెకి ఊతమిచ్చింది.

***

"నేను సెయింట్ జాన్ చర్చిని మళ్లీ నిర్మిస్తాను. ఆ చర్చిని ధ్వంసం చేసినవారు దారి తప్పినవారు. వారి భయానికి మనం మౌనంగా ఉంటే మనం జీసస్ దృష్టిలో నేరస్తులమౌతాం. అందుకే 'సేవ్ సెయింట్ జాన్ చర్చ్ కమిటీ'ని ఏర్పాటు చేస్తున్నాను. మనమంతా విరివిగా విరాళాలు ఇచ్చి చర్చి పునర్నిర్మాణానికి తోడ్పడాలి. శరీరం రంగు ఏదయినా దేవుడొక్కడే అని నిరూపించాలి".

ఆమీ నిర్ణయాన్ని కొందరు సమర్థించారు. ఇంకొందరు విమర్శించారు. కానీ ఆమె చెదరలేదు.

ఆమె కొందరు మిత్రులతో కలసి కమిటీ ఏర్పాటు చేసింది.

సెయింట్ జాన్ చర్చిపై దాడి విషయం ఏ వార్తా పత్రికలో రాలేదు.

పిల్లి తప్పిపోయినా ప్రధాన వార్తగా చూపించే చానల్‌వారు కూడా ఆవైపు రాలేదు. ఆమీయే స్వయంగా ప్రతి పత్రిక ఆఫీసుకి వెళ్లి వార్త అందించింది. ఫొటోలు ఇచ్చింది. కానీ ఒక్క 'డిస్పాచ్ న్యూస్' పత్రిక మాత్రమే ఆ వార్త ప్రచురించింది.

మిగతా వారంతా ఉదాసీనంగా ఉండిపోయారు.

ఆమీ వెళ్లి డిస్పాచ్ న్యూస్ పత్రిక ఎడిటర్ 'జెర్రీ బెల్లాన్'ను కలిసింది. "మీరు ఒక్కసారి వచ్చి చర్చిని చూసి మళ్లీ వార్త రాయండి" అని కోరింది.

***

జెర్రీ వార్త రాయటంతో ఆగలేదు. తనకు పరిచయమైన జర్నలిస్టులందరితో వార్త రాయించాడు. పోలీసు రిపోర్టు ఇచ్చాడు. పోలీసుల ఉదాసీన వైఖరిని విమర్శించాడు. ఆమీతో ఇంటర్వ్యూ ప్రచురించటమే కాదు, తనకు పరిచయం ఉన్న చానళ్లలో ఆమెకు ఉపన్యాసం ఇచ్చే అవకాశం ఇప్పించాడు.

నెమ్మదిగా ఆమీ చేస్తున్న పనికి ప్రచారం రాసాగింది. నల్లవారు, తెల్లవారు కలిసి వున్న 'సేవ్ సెయింట్ జాన్ చర్చి' కమిటీ ప్రజలను ఆకర్షించింది. కొందరు దారితప్పిన వ్యక్తుల నేరానికి ప్రతిగా చర్చి పునర్నిర్మాణానికి ఆమీ స్వచ్ఛందంగా నడుం కట్టటం అమెరికా ప్రజలను కుదిపింది. ఫలితంగా విరాళాలు రావటం ఆరంభమయింది. వాలంటీర్లు పెద్ద సంఖ్యలో వచ్చి చర్చి నిర్మాణంలో పాల్గొనటం ప్రారంభించారు. వీటితోపాటూ ఆమీకి బెదిరింపు ఉత్తరాలు, ఫోన్ కాల్స్ రావటం మొదలయింది.

"...నిన్ను చంపేస్తాం" అంటూ బెదిరించేవారు.

ఆమె కారును వెంబడించేవారు. అర్ధరాత్రి ఇంట్లో దూరి కుక్కల్ని చంపేసేవారు. ఆమీ ఇల్లు మారింది.

కానీ తన లక్ష్యాన్ని మార్చలేదు. 1986 చివరికల్లా చర్చి నిర్మాణం పూర్తయింది. అయితే ఆమీ పని పూర్తి కాలేదు.

ఎందుకంటే చర్చిపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు చర్చి విషయం దేశమంతా తెలియటంతో పోలీసులు చురుకుగా పనిచేయటం ప్రారంభించారు. దాంతో పెద్దగా నష్టం కలగలేదు. 1986 నుండి 1994 వరకూ దాదాపుగా 200 మందిని చర్చిపై దాడి చేసిన నేరానికి అరెస్టు చేశారు.

ప్రజల నడుమ సౌభ్రాతృత్వ భావనల పెంచేందుకు ఆమీ చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం ఆమెకు 'జెఫర్‌సన్ అవార్డు'ను ఇచ్చి సత్కరించింది. ఆ అవార్డును ఆమె జీసస్‌కే అంకితమిచ్చింది.

అంతా సవ్యంగా సాగుతోందని అనుకునేంతలో, మళ్లీ చర్చిని కాల్చేస్తున్నారన్న వార్త వచ్చింది.

***

'సేవ్ సెయింట్ జాన్ చర్చి కమిటీ' సమావేశం జరుగుతోంది.

"మనం దాదాపుగా ఎనిమిదేళ్లు అవిశ్రాంతంగా శ్రమించాం. చర్చిని నిర్మించాం. కానీ ఇప్పుడది బూడిద అయిపోయింది. ఆ బూడిద స్థానంలో మళ్లీ చర్చిని నిర్మించే ఓపిక మనకి ఉందా?" దాదాపుగా అందరి మదిలో మెదలుతున్న ప్రశ్న ఇది.

"మనం చర్చిని నిర్మించకపోతే మనం ఓటమిని ఒప్పుకున్నట్లు అవుతుంది. ప్రేమ పరాజయం పొందినట్టవుతుంది" అంది ఆమీ. అందరినీ ఉత్సాహపరచే ఉద్దేశంతో. కానీ అందరూ నీరసించిపోయారు. ఎవరూ ఉత్సాహం ప్రదర్శించటం లేదు.

అది చూసిన ఆమీలో సంశయం ప్రవేశించింది. 'తాను మళ్లీ చర్చిని నిర్మించగలదా? తన కర్తవ్యం ఒక్కర్తే నిర్వహించగలదా? ఎదురుగా శిలువపైనుండి జీసస్ ఆమెని చూసి నవ్వుతున్నట్లు, 'ఇంత చిన్న ఎదురుదెబ్బలకే లొంగిపోతావా?' అని అడుగుతున్నట్లు-

"కొరడా దెబ్బలు అవిశ్రాంతంగా తగులుతున్నా, రక్తం ఏరులయి పారుతున్నా, శరీరంలోకి మేకులు దిగబడుతున్నా, సత్యపథంలో ఆగకుండా ప్రయాణించేవాడే నిజమైన అనుచరుడు" అని యేసు అంటున్నట్లు తోచింది. "మీరెవరూ ముందుకు రాకున్నా ఫరవాలేదు. నేను ఒక్కర్తినే ఎలాగో అలా చర్చి నిర్మిస్తాను" ఆవేశంగా అంది ఆమీ.

ఆమె ఎదురుగా ఉన్న ఓ రాజకీయ నాయకుడు ఏదో అనబోయాడు. ఇంతలో ఆమీ ఫోను మోగింది. రిసీవర్ ఎత్తి "హలో" అంది.

"మేడమ్ నా పేరు ఆల్‌హోల్బ్రేర్. నేను ఇప్పుడే టీవీలో సెయింట్ జాన్ చర్చిగురించి కార్యక్రమం చూశాను. మీ శ్రమ అభినందనీయం. అందుకే నా వంతుగా నేను చర్చిని పునర్నిర్మించటంలో సహాయపడ దలచుకున్నాను. నేను కాంట్రాక్టర్‌ని. చర్చి మొత్తం నేను ఉచితంగా నిర్మించి ఇస్తాను". ఆమీ కమిటీ సభ్యులవైపు చూసి నవ్వింది.

శిలువపై నుండి జీసస్ ప్రేమ వెన్నెల కురిపిస్తున్నట్లు....

***

నవంబర్ 8, 1998న సెయింట్ జాన్ చర్చి పునర్నిర్మాణం పూర్తయింది. అందరూ ఆమీపై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

"ఈ భూమిపై దైవకార్యం సాధించటమే మానవుల కర్తవ్యం" అంది ఆమీ చిరునవ్వుతో..!